ఆంధ్రజ్యోతి
శనివారం
17 ఫిబ్రవరి
2024

భట్టుమూర్తి 'వసుచరిత్ర'ను పూజించిన ఘంటసాల!

ఆంధ్ర సంస్కృతాంధ్రాల్లో 'వసుచరిత్ర' రెండవది. 'రామరాజభూషణ' బిరుదాన్ని పొందిన భట్టుమూర్తి (ప్రబంధాంకం మూర్తిరాజు) ఈ ప్రబంధాన్ని రాశారు. విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన తిరుమల దేవరాయల వారికి గ్రంథం అంకితం చేశారు. భట్టుమూర్తి అష్ట దిగ్గజ కవులలో ఒకరు.

ఈ కవి 1510-1585 సంవత్సరాల మధ్య జీవించినట్లు తెలుస్తున్నది. స్వస్థలం కడప జిల్లాలో గల భట్టువల్లె. తండ్రి సూరపరాజు. భట్టుమూర్తి బాల్యం నుంచి అసమానమైన కవితాధారతో గణుతికెక్కిన దాఖలాలున్నాయి. అనేక నిఘంటువులు నోటిలోనే ఉండేవని సాహిత్యవ్యాసాలు చెపుతున్నాయి. విజయనగర సామ్రాజ్యంలో భట్టుమూర్తి కవిత్వం మూడు పూలు, ఆరు కాయలుగా శోభించింది. ముఖ్యంగా శ్లేష కవిత్వంలో అందెవేసిన చేయి. ఒక్క సాహిత్యమే కాదు! సంగీతం లోనూ, జ్యోతిషం లోనూ నిష్ణాతుడనిపించుకొన్నారు.



పండితప్రకాండుడైన భట్టుమూర్తి వీధులలో వెడుతున్నప్పుడు వేదపండితులు సైతం వేదాల్ని వల్లించే వారు కాదట, ఎక్కడ తప్పుదొర్లి భట్టుమూర్తి కంటిలో పడవలసి వస్తుందేమోనని సందేహించే వారట. జనశ్రుతిలో 'అట'గా నున్న దీనిని పుట్టపర్తి వారు తమ పుస్తకం 'వసుచరిత్ర-సాహితీ సౌరభం' లో పేర్కొన్నారు. ఏది ఏమైనా అంతటి పుంభావసరస్వతి భట్టుమూర్తి. ఈ వసుచరిత్ర ఆవిర్భవించాక- ఇదే పక్కీలో మరికొన్ని పిల్ల వసుచరిత్రలు శ్రీకారం చుట్టుకున్నాయి. వసుచరిత్రకు వ్యాఖ్య రాసిన ఉద్దండ పండితులు శిష్ట కృష్ణమూర్తి- కావ్యంలో ఒక్కొక్కచోట ఎనిమిది అర్థాలు కూడా చూపించారు. ఇతర భాషాకవులు కూడా ఈ కావ్యాన్ని అనువదించకుండా ఉండలేకపోయారు. సంస్కృతంలో కాళహస్త కవి, తమిళంలో అంబలత్రాడు మయ్యన్, కన్నడంలో లక్ష్మీశుడు, మరాఠీలో గుండేరావు హర్కారే, ఆంగ్లంలో కావలి వెంకటరామస్వామి అనువాదకులుగా ఉన్నారు.

భట్టుమూర్తి మరికొన్ని గ్రంథాల్ని వెలయించారు. నరసభూపాలీయం (కావ్యాలంకార సంగ్రహం), హరిశ్చంద్రనలోపాఖ్యానం (ద్వ్యర్థికావ్యం) రామరాజభూషణుని పాండితీప్రకర్షకు పతాకస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చాయి. పైగా దానశీలి. దేవాలయాలు, సరస్సులూ నిర్మించారు.

ఈ 'వసుచరిత్ర' ప్రబంధం ఆవిర్భవించి నాలుగు వందలేండ్లయిన సందర్భంగా 1973 ప్రాంతంలో భీమవరం శ్రీరామరాజభూషణ సాహిత్యపరిషత్తు వారొక సభను ఘనంగా నిర్వహించారు. అదే స్ఫూర్తితో వసుచరిత్ర చతుశ్శతజయంతి మహోత్సవం 1973, డిసెంబర్ 25న ఈ వ్యాసకర్త ప్రధాన కార్యదర్శిగా ఉన్న తాడేపల్లిగూడెం తెలుగు సాహితీ సమాఖ్య పక్షాన నిర్వహించారు. అనాటి సభను డా. బెజవాడ గోపాలరెడ్డి, డా. బిరుదురాజు రామరాజు, డా. పసల సూర్యచంద్రరావు, కనమలూరి వెంకటశివయ్య ప్రభృతులు అలంకరించగా, మంటసాల వారు ప్రధాన భూమిక పోషించారు. అప్పటికే వారు అస్వస్థులుగా ఉన్నారు. అయినా 'సంగీతకళా రహస్యనిధి' రామరాజభూషణుని పట్ల భక్తిభావంతో వారు విచ్చేసి వ్యాసపీఠంపై వసుచరిత్ర ప్రబంధాన్ని ఉంచి పూజ చేశారు. కరుణశ్రీ "పుట్ట భోయెడి బుల్లిబుజ్జాయి కోసమై.." అనే పద్యం గానం చేశారు. సభానంతరం 'గిరికావసురాజీయం' రూపకం ప్రదర్శితమైంది. అదొక రసాత్మక సన్నివేశం. వసుచరిత్రలో కొన్ని పద్యాల్ని వీణపై వాయించేవారట. "లలనాజనాపాంగ.." మొదలైన పద్యాలు చదువుతుంటేనే సంగీతం మనకు వినిపిస్తుంది. అదీ భట్టుమూర్తిలోని సంగీతకళా రహస్యం. ఈ కవి గురించి జాషువా ఏమన్నారో చూడండి.

"దాటవశంబుగాని కవితానియోమోన్నత భీత్తికత్ నిరా
ఘాటి జవంబున స్నెగని గంతులు వెట్టెడు నీదు శ్లేషవా
గ్ధాటికి పెద్దనాది కవిదంతులు తత్తరమందలేదె! ఆ
నాటికి నేటికింక నొకనాటికి నీకెదురేది సత్కవీ!"

ం రసరాజు

(రేపు- విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్ర ప్రాంగణంలో రామరాజభూషణుని విగ్రహ ప్రతిష్ఠాపన)